REGD. NO. 40 A | విడిప్రతి 0-2-0 | 21-10-55 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 27 ❖ మేనేజింగుఎడిటర్ : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ❖ సంచిక 42

విశాలాంధ్రకు ●

# మన ఆందోళన వ్యతిరేక ఫలితాల నిస్తుంది!

## తెలంగాణా తెలుగువారుపూనుకుంటే తక్షణం ఏర్పడకతప్పదు

ఫజలాలీ కమిషన్ నివేదిక బయటపడ దంతో విశాలాంధ్ర ఆందోళన ఉధృతమైంది. ఇది ప్రజలనుండిగాక, రాజకీయ పార్టీలనుండి, నాయకులనుండి యెక్కువగా జరుగుతున్నదా అనిపిస్తున్నది - పత్రికలలో వాదోపవాదాలు చూచినతర్వాత. అదీగాక యీ ఆందోళన హైదరాబాద్ తెలుగువారినుండి కంటే, ఆంధ్రరాష్ట్రంనుండే యెక్కువగా జరుగుతున్న దేమోకూడా!

ఇదివరలో కొన్ని వందలసార్లు చెప్పకొన్నట్లు విశాలాంధ్ర విషయంలో రెండు అభిప్రాయాలంటూ ఆంధ్రదేశంలో లేవు. ఏమైనా అభిప్రాయభేదాలు, భయసందేహాలు వుంటే అవి తెలంగాణావారిలోనే వున్నట్లు యిటీవల వస్తున్న ప్రకటనలనుబట్టి మనం వూహించుకోవచ్చు.

గతవారం మా సంపాదకీయంలో వెలిబుచ్చినట్లు, ఆరేళ్లవరకు తెలంగాణా జిల్లాలను ప్రత్యేకంగా వుంచాలనే తమ సూచనకు

> **ఆంధ్రభావతరంగాలు**
> మా రాజకీయ పరిశీలకుడు

ఆధారంగా ఫజలాలీకమిషన్‌వారు చేర్కొన్న కారణాలు సముచితమైనవి కావనలేము. విశాలాంధ్ర ఏర్పడడమే తెలుగువారి సర్వతోముఖాభివృద్ధికి అవసరమని, స్వామి రామానంద తీర్థగారు చెప్పినట్లు విశాలాంధ్రకు తెలుగువారికంటే చక్కగా వాదంజేసిన ఫజలాలీకమిషన్, దాని అవతరణకు షరతులు విధించడం సబబుగాలేదు. విశాలాంధ్ర తక్షణం ఏర్పడితే ఎన్నో లాభాలున్నాయి. ఆ లాభాలను మేము యిక్కడ ప్రత్యేకంగా వుదహరించవలసిన అవసరంలేదు— ఫజలాలీ కమిషనే వాటిని పేర్కొన్నది. కాని తెలంగాణాలోని కొందరు తెలుగునాయకులకున్న సందేహాలవలనే, యీ కమిషన్ సభ్యులకు కూడా కొన్ని అనుమానాలేర్పడ్డట్లున్నవి. అలాంటివాటిని యీనాడేగాదు, ఏనాడైనా ఎదుర్కోవలసి వుంటుంది. ఆబ్కారీలో పోయే ఆదాయం రెండు ప్రభుత్వాల బదులు, ఒక ప్రభుత్వంగా వ్యవహరించడంవల్ల కొంత పూడ్చుకునే అవకాశముంటుంది. అదీగాక వెంటనే మద్యనిషేధం ప్రవేశపెట్టడం నష్టదాయక మనుకుంటే, ప్రథమంలో మద్రాసు రాష్ట్రంలో అంచెలు అంచెలుగా ప్రవేశపెట్టినట్లు, వెనుక ముందులు చూచుకుంటూ, కొంత నిర్దిష్టపద్ధతిలో ప్రవేశపెట్టుకోవచ్చు. ఇక

### తెలంగాణా ప్రత్యేకంగావుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థితి దినగండమౌతుంది : ఆంధ్రలోచేరి సుస్థిర ప్రభుత్వానికి ఎందుకు దోహదం చేయగూడదు?

గాక, మద్యనిషేధం అన్నిరాష్ట్రాలలో ప్రవేశపెట్టవలసిందిగా కేంద్ర సంఘం సూచించివున్నది. ఆ సూచన ఆరు సంవత్సరాలపాటు అమలు జరపకుండా వుంటారనే హామీ ఎక్కడవున్నది? ఆ కమిటీ సూచనలు అమలు జరిగినపుడు, హైదరాబాదు తెలుగు జిల్లాలు ప్రత్యేక రాష్ట్రంగావున్నా యీ ఆదాయాన్ని కోల్పోవలసిందేగదా! అందువల్ల యిది ఒక పెద్ద అడ్డంకి కాదేమో! భూసంస్కరణలు లాంటి చట్టాల విషయంగూడా, ఆయాజిల్లాల, ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులనుబట్టి చట్టం అమలు జరిపినందువల్ల తప్పేమున్నది? మద్రాసు రాష్ట్రంలో ఒక్క తంజావూరు జిల్లాలో మాత్రమే కౌలుదార్ల చట్టం అమలు జరుపబడింది. అదే సూత్రాలు అన్ని జిల్లాలకు వర్తింపజేయడం యుక్తంగా వుంటుందనగలమా? అందువల్ల తక్షణం విశాలాంధ్రకు యిదిగూడా ఒక ప్రతిబంధకం కాదనుకుంటాము. మూడవ ఆక్షేపణ విద్య, వుద్యోగాల విషయంలో వెనుకబడి వున్నారనేది. ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమ, విశాఖ, శ్రీకాకుళం మున్నగుజిల్లాలు వెనుకబడివుండి, దానికి తగిన సహాయాన్ని, ప్రత్యేక ఆదరణను పొందుతున్నవి. తెలంగాణా విషయంలో మాత్రం అది మరొక విధంగా వుండగలదని ఎందుకు భయపడవలెనో మాకర్థంకావడం లేదు. గోదావరి, కృష్ణప్రాజెక్టులకు సంబంధించి ఏక పరిపాలన వున్నప్పటి సమగ్ర అభివృద్ధి, విభిన్నతలోవుండే అవకాశం వుండదు. అందువల్ల ఏ దృష్టిలో చూచినా, హృదయాలలో మార్పురావాలగాని, యీ కారణాలేమీ పెద్దసమస్యలు కావని మాఅభిప్రాయం.

మావూహ కందినంతవరకు, విశాలాంధ్ర తక్షణ నిర్మాణానికి ప్రతిబంధకంగా వున్న ఒకేఒక పెద్దసమస్య, తమ నాయకత్వాలపట్ల, భవిష్యత్తులో తమ ప్రతిపత్తిపట్ల తెలంగాణా కాంగ్రెసు నాయకులకున్న అనుమానాలేనని తోస్తున్నది. దానికి కొంతవరకు విశాలాంధ్రపట్ల కొందరు ఆంధ్రనాయకులు ప్రదర్శిస్తున్న తొందరపాటు, ఆంధ్ర కాంగ్రెసు నాయకులలోని అస్థైర్యత, ముఠాతత్వాలు కారణంగా వుండవచ్చు. కాని ఇవి స్పష్టరూపం చేసుకొనుటకు వీలుకానివికావు. పదిజిల్లాలను విస్మరించి, దాదాపు వందమంది శాసనసభ్యులను తోసిపుచ్చి, ఆంధ్రనాయకులు తెలంగాణా వారిపై పెత్తనం చెలాయిస్తారనుకోవడం, అన్యాయం చేస్తారని భావించడం కేవలం భ్రమ తప్ప వేరుగాదు. అన్నివిధాల ఎంతో వెనుకబడి వున్నారనుకున్న రాయలసీమ వారు, అందరికంటే ప్రత్యేక లాభాలను పొందగలుగుతున్నప్పుడు, తెలంగాణావారి భయానికి కారణం కనుపించదు. కాని విశాలాంధ్రకు ఆంధ్రదేశీయుల ఆందోళనకంటే, తెలంగాణావారే సమాలోచించుకొని, హృదయం విశాలం చేసుకొని, సమష్టి క్షేమాన్ని, లాభాలను దృష్టిలో వుంచుకొని, ఏకాభిప్రాయానికి రావడం వుచితంగా వుంటుంది. ఆంధ్రదేశం నుండి విశాలాంధ్రకొరకు వచ్చే ఆందోళన తెలంగాణావారికి అపోహలు కల్గిస్తున్నది. కేవలం మనస్వార్థంకొరకు విశాలాంధ్ర కోరుతున్నామనే అభిప్రాయం వారిలో వున్నదేమో? అందువల్ల విశాలాంధ్ర ఆందోళన తెలంగాణావారినుండి రావాలె. వారిని మనం బలపరచాలె. అప్పుడు తక్షణం ఏర్పడక

—తరువ 6-వ పేజీలో.

## మంచి అదును!

ప్యాడీమిక్చర్లు వాడుటకు యిది మంచిఅదును

మన జిల్లా రైతుల అభిమానము, ఆదరణ పొందిన మా

నాగలి మార్కు

### ప్యాడీమిక్చరు

యీ క్రింద వుదహరించిన డిపోలలో తయారుగావున్నది.

రైతులు త్వరపడవలెను.

కావలి, అల్లూరు, ఊటుకూరు, అలగాపాడు, ముదివర్తి, కోవూరు, నెల్లూరు, కోట.

**ఆంధ్ర బోన్‌మీల్ ఫెర్టిలైజర్ కంపెనీ**

4/91 నవాబుపేట (నర్తవరపువారి మిల్లుకుపోయేరోడ్డు)

నెల్లూరు

టెలిఫోన్ : 67.

